


# తామరాకుపై నీటిబిందువు

సూర్యప్రభ

మనిషి వూహాజీవి. అతడు వూహలలో విహరిస్తాడు. కలలలో జీవిస్తాడు. అందని వాటివి ఎన్నిటివో వూహలలో అందుకోగలుగుతాడు.

నిజజీవితంలో అనుభవించలేని ఆనందాలను కలలలో అనుభవించటానికి ప్రయత్నిస్తాడు.

వాస్తవ పరిస్థితులను గమనించకుండా భవిష్యత్తును అందంగా వూహించుకుంటాడు మానవుడు. కానీ వూహలనుండి కలలనుండి తెప్పరిల్లి వాస్తవాన్ని గ్రహించిననాడు ఆ మానవుడు తన తెలివితక్కువతనానికి విచారిస్తాడా? లేక నిప్పులాంటి నిజం కాల్చిన మచ్చను చూసుకుని క్రుంగిపోతాడా? ఏమో, ఎవరికి తెలుసు?

నిజాన్ని తెలుసుకున్ననాడు ఆ మానవుని మనస్తత్వాన్ని వర్ణించటం ఎవరికి సాధ్యం? భగవంతునికి తప్ప మరెవ్వరికీ అర్థం కాదు అతని ఆవేదన!

విధిలిఖితం అని నిట్టూర్చాలి తోటి మానవులు, అంతే! అంతకన్నా ఏం చెయ్యగలరు ?

'నాన్నా! నాన్నా! మరేమో......'

స్కూలునుండి ఇంటికి రాగానే తన మాటల మూటను మెల్లిగా విప్పసాగింది రేవతి.

'కబుర్లు తర్వాత చెపుతూగానమ్మా! లోపలికి వెళ్లి మనింటికి ఎవరు వచ్చారో చూడు. చూసి...' తండ్రి రాఘవరావు మాట పూర్తవ్వకముందే అతని వడిలోంచి కిందకి దూకి లేడిలా లోపలకు పరుగెత్తింది రేవతి.

వంటింట్లో పీటమీద కూర్చున్న యువతిని చూసి తల్లి మెడ చుట్టూ చేతులు వేసి 'అమ్మా! ఆవిడెవరే?' అంటూ ముద్దుగా అడిగింది రేవతి.

మానసిక సంక్షోభాన్ని అణచుకుంటూ తలెత్తి కూతురి కళ్లల్లోకి చూసింది సుమిత్ర 'గుర్తుపట్టలేదూ, నువ్వు:'

ఆశ్చర్యంగా తల్లి మొహంలోకి చూసింది రేవతి 'ఎవరబ్బా ఆమె?'

'రేవీ'! అంటూ పిలిచే నీ శ్యామత్తని మరిచిపోయావా?' సుళుసుళ్ళుగా తిరుగుతున్న కన్నీటిని అతి బలవంతంమీద నిగ్రహించుకుంటోంది సుమిత్ర.

'శ్యామత్తా! నిజం? అదేమిటి మరి...' ఆశ్చర్యాంబుధిలో మునిగిన రేవతి వింతగా శ్యామల కళ్లల్లోకి తదేకంగా చూస్తూ వుండిపోయింది. చిన్నప్పుడు తాను చూసిన శ్యామత్త ముహం లీలగా మెదిలింది రేవతి కళ్ళముందు. 'శ్యామత్త ఇలా మారిపోయిందేమిటి? ఆ కళ్ళల్లో మెరుపు లేవి?'

'ఏమిటలా చూస్తున్నావ్ రేవతీ! మన శ్యామత్తే!'

'మరి...మరి...అత్తయ్య ఇన్నాళ్ళూ ఎక్కడుంది?'

'రఘు చిన్నాన్నగారింట్లో వుంది. నిన్ను చుద్దామని...' మాట మధ్యలో ఆపేసి శ్యామలవైపు చూసింది సుమిత్ర. అప్పటివరకూ నిర్జీవమయిన నేత్రాలతో చూస్తున్న శ్యామల పాలిపోయిన మొహాన్ని కిందకు వంచకుని పంటితో గట్టిగా పెదవిని నొక్కిపట్టి వుంచింది. కన్నీటిని కారనీయకుండా ఆమె చేసే ప్రయత్నం ఒక్కక్షణంలో గ్రహించగలిగిన సుమిత్ర చప్పున

మాట మార్చేసి 'అత్త దగ్గరకు వెళ్లమ్మా' అంటూ కూతురు చేతిని శ్యామల చేతిలో పెట్టింది తన చేతిని పట్టుకున్న అత్త చెయ్యి విపరీతంగా వణకటం గమనించిన రేవతి ఆమె ముఖం వేపు, ఆ కళ్ళ వేపూ పరీక్షగా చూడసాగింది. క్షణాలు సెకండ్లుగా, సెకండ్లు నిమిషాలుగా మారిపోతున్నాయి.

ఆ భయంకరమైన నిశ్శబ్దంలో రేవతి మాటలు ప్రతిధ్వనించాయి. 'అమ్మా! ఏమిటలా వున్నారు?'

సుమిత్ర తుళ్ళిపడింది. 'శ్యామలా! జరిగిందేదో జరిగిపోయింది. పూర్తిగా నువ్వది మరిచిపోవాలి. ప్లీజ్, నా మాట విను శ్యామలా! ఈ వదిన నిన్ను కంటిలో పాపగా చూసుకుంటుంది. నాపై ఆ మాత్రం నమ్మకం వుంచలేవా?'

'లాభంలేదు వదినా! నా జీవితగతినే మార్చివేసిన ఆ దుష్ట ఘడియ ప్రభావం నా మనస్సుపై చెరగని ముద్రగా నిలిచిపోతుంది. వేళ్ళు పాతుకుపోయిన వాలోయూ భావాన్ని మార్చటం మరెవరికీ సాధ్యం కాదు.' కాంతిలేని కళ్ళను పైకెత్తి కంపిస్తున్న కంఠస్వరంతో అంది శ్యామల 'కానీ...కానీ... ఈ మనస్సుని నువ్వు పట్టించుకోకు వదినా!'

బాధగా నిట్టూర్చింది సుమిత్ర 'పట్టించుకోకపోవటానికి ఇది రాతి హృదయం కాదు శ్యామలా! క్షణక్షణానికి నువ్విలా బాధపడుతూంటే నేను ఎలా సహించగలను? నా కళ్ళముందు ఆడుతూపాడుతూ తిరిగిన నువ్వు, ఈ నాడిలా దుఃఖంతో కృంగిపోతూవుంటే చూసీ చూడనట్టుగా వుండటానికి నేను రాక్షసిని కాదే?'

'లేదు వదినా లేదు.' తల అడ్డంగా వూపుతూ అంది శ్యామల 'నేను ఎంత సుకుమారంగా పెరిగానో నీకు తెలుసు అన్నయ్యకన్నా నన్ను నువ్వే బాగా అర్థం చేసుకున్నావు. నువ్వేమయినా చెప్పదలచుకుంటే నా మనసుకే చెప్పు. సుమిత్ర వదిన మంచితనం నాకు తెలియంది కాదుగా?'

అప్రయత్నంగా సుమిత్ర కళ్ళు చెమ్మగిల్లాయి. వాత్సల్యంగా శ్యామల తల నిమురుతూ అందామె. 'ఉహు, నేనంత మంచిదాననా! పిచ్చి శ్యామా! స్త్రీ హృదయం స్త్రీకే అర్థం అవుతుంది. కన్నతల్లిగా కాపాడటం కాదు. పెంచినతల్లిగా ఆదరిస్తుంది శ్యామలా ఈ వదిన నిన్ను.'

'కృతజ్ఞురాలిని వదినా! ఒక విషయం చెప్తాను. వింటావా?'

'ఏమిటది? కథా?'

రేవతి కళ్ళలో కుతూహలం తొంగి చూసింది.

'కాదు. నా సున్నిత మనస్తత్వాన్ని వివరించే సంఘటన!...'

'ఓహో' సుమిత్ర తృప్తిగా నిట్టూర్చింది.

'తాతయ్యకి ఒక మిల్లులో వాటావుండేది నాన్న అందులో మేనేజరుగా వుండేవారు. తాతయ్యకి, తక్కిన వాటాదార్లకి పేచీ వచ్చింది. తాతయ్య తన వాటా వదులుకుని స్వంత వూరు వెళిపోయారు. తాతయ్య అక్కడనుండి నాన్నకి వుత్తరం వ్రాశారు 'వెంటనే మిల్లులో వుద్యోగానికి రాజీనామా ఇచ్చేసి కుటుంబంతో ఇక్కడకు వచ్చెయ్యండి నేను ఇక్కడ మిల్లు కొంటాను నీకందులో వుద్యోగం ఇస్తాను. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. వెంటనే బయల్దేరి రావలసింది.' నీటికి పాలకి భేదం తెలియని నాన్న వుద్యోగానికి రాజీనామా ఇవ్వటానికి నిశ్చయించుకున్నారు. అమ్మ ఎంతో బ్రతిమాలింది నాన్నని. అమ్మకి ఎంతమాత్రమూ ఇష్టంలేదు పుట్టింటికి వెళ్ళటానికి! దూరంగా వుంటేనే ప్రేమలూ, అభిమానాలూ పుట్టుకువస్తాయి. మనిషి కళ్లెదురుగా కనిపిస్తే ఆ ప్రేమాభిమానాలూ మారురూపుదాల్చిన మంధర రూపంలో ప్రత్యక్షమవుతాయి. మానవుల తత్వాలను అమ్మ అర్థం చేసుకున్నంతగా నాన్న అర్థం చేసుకోలేకపోయారు. అది నా చిన్నతనం. తెలిసీ తెలియని వయస్సులో వారి మాటలను శ్రద్ధగా ఆలకించాను, నా చిన్ని మనసులో ఎన్నో వూహలు చెలరేగాయి. తాతయ్యపై నమ్మకంతో నాన్న వెంటనే వుద్యోగానికి రాజీనామా ఇచ్చారు. కానీ! నాకు మాత్రం అమ్మమాటలే నచ్చాయి. ఎందుకనో! ఫలితం తాతయ్యపై కోపం ముంచుకువచ్చింది నాలో ప్రతీ అణువూ ప్రతీకారం అంటూ అరుస్తుంది. కానీ అంత పెద్ద తాతయ్యపై ఎనిమిదేళ్ళయినా నిండని నేను ఎలా తీర్చుకోను ప్రతీకారం. తాతయ్య యింట్లో అడుగు పెట్టాం. నా కళ్ళు ఆ యింట్లోని ప్రతీ అంగుళాన్నీ నిశితంగా పరిశీలిస్తున్నాయి. ప్రతీకారానికి ఏదైనా పరికరం దొరుకుతుందేమోనని కామోసు? నా కళ్ళు అప్రయత్నంగా హాల్లో ఒక మూలన పెట్టివున్న తాతయ్య చెప్పులమీద పడ్డాయి. పళ్ళు గట్టిగా బిగపట్టి నా శక్తికొద్దీ ఆ చెప్పులను తన్నసాగాను. తాతయ్యపై ఎలా నా పగను తీర్చుకోవాలా అని ఆలోచిస్తున్న నేను – నాకు అందుబాటులోవున్న ఆ చెప్పులపై నా పగ తీర్చుకుంటున్నాను. అవి తాతయ్య చెప్పులనీ, వాటిని అలా తన్నడం తాతయ్యకు అగౌరవం చెయ్యటమేనని నాకు ఎవరు చెప్పారు? ఉహు, ఎవ్వరూ చెప్పలేదు. అయినా ఆ సమయంలో నన్నెవరైనా చూస్తే చిన్నపిల్ల ఆట అని అనుకుంటారేగానీ నా మనసులోని వుద్దేశం ఎవరికీ అర్థంగాదు. అలా చెప్పులను తంతున్న నేను నాన్న దృష్టిలో పడ్డాను. 'తప్పమ్మా! అలా తన్నకూడదు. తాతయ్య చూస్తే ఏమనుకుంటారు?' నా మనసులోని పగను నాన్న అర్థం చేసుకున్నందుకు విజయగర్వంతో నవ్వాను

'శ్యామత్తకు కోప మెక్కువ' కళ్ళు చిత్రంగా తిప్పుతూ అంది రేవతి.

'మొగవాళ్ళయినా విూ అన్నయ్యలకు రోషం రాలేదనుకుంటా' సుమిత్ర అడిగింది.

'అలా అనుకోవటం పొరపాటు వదినా! కోపానికి స్త్రీ పురుష భేదంలేదు ఒక్కొక్కళ్ళ మనస్సులు అంత సున్నితంగా వుంటాయి మరి.'

'అవును శ్యామలా! సత్యభామలా అభిమానవంతురాలివి.' పక్కున నవ్వింది శ్యామల. 'సత్యభామకున్న అహంకారం మాత్రం నాకులేదు వదినా!'

'అయితే శ్యామత్తకు శ్రీకృష్ణుడు లాంటి మామయ్యనిచ్చి పెళ్ళిచెయ్యాలి.' అల్లరిగా చప్పట్లుకొడుతూ అంది రేవతి.

నవ్వుతున్న శ్యామల మొహం నల్లబడిపోయింది

ఆది గమనించిన సుమిత్ర కోపంగా చూసింది రేవతిని

'బొత్తిగా మంచి మర్యాదా లేకుండా మాట్లాడుతున్నావు రేవతీ! పెళ్ళిపేరయ్యలా మాట్లాడటానికి నీకంత పెద్ద వయస్సా.'

సుమిత్ర కటుస్వరానికి కలవరపడి

పోయింది. శ్యామల 'పాపకేం తెలుసువదినా! చిన్నతనం. నేను ముందేచెప్పాను. నామనసు అలా ఫీలయినప్పుడు నువ్వే నన్ను మందలించాలి. ఎందుకంటే నువ్వే అన్నావ్ 'పెంచిన తల్లిగా నన్ను ఆదరిస్తానని.'


# రస్టన్

హారిజంటల్ ఇంజన్లు

- ఖర్చు తక్కువయైనవి
- మన్నికైనవి
- నమ్మకమైనవి
- సులభమైనవి






అమ్మేవారు మరియు సర్వీస్ చేయువారు
ఏమ్/ఎస్ గ్రీవ్స్ కాటన్ & కం లి.
మద్రాస్. 19. సెకండ్ లైన్ బీచ్.
బెంగుళూర్-2 73/1-ఎ. జయచామరాజేంద్ర రోడ్,
కోయంబత్తూర్-18 ట్రిచి రోడ్,
హైదరాబాద్-4. పతెమైదాన్ రోడ్.

RUS/67/1 TEL


## తామరాకుపై నీటిబిందువు

'మందలించనూ మరి మూడు చెరువుల నీళ్ళుకూడా తాగిస్తాను' సుమిత్ర మనస్సు అంతులేని సంతృప్తితో నిండిపోయింది. 'భగవాన్! శ్యామలకు వావల్ల ఏ కష్టమూ కలగకుండా కాపాడు తండ్రీ!' మనస్సులో భగవంతుని వేడుకుందామె 'రేవతి ! శ్యామత్తను హాల్లోకి తీసికెళ్ళమ్మా!'

బిత్తరపోయి చూస్తున్న రేవతి ముఖంలో ఆనందపు రేఖలు తళుక్కు మన్నాయి. 'శ్యామత్తా! రావెళ్దాం నీకు బోలెడు కబుర్లు చెప్తాను, రా మరి' అంటూ ఆమె చెయ్యి పట్టుకు లాగసాగింది రేవతి. ఆపిల్లచేతిని మరింతగా బిగించి పట్టుకుని వంటింట్లో నుండి గదిలోకి వెళ్ళింది శ్యామల.

'కూర్చో శ్యామత్తా! ఇవన్నీ మనకుర్చీలే' అమాయికంగా శ్యామల మొహంలోకిచూస్తూ అంది రేవతి.

ఫక్కున నవ్వి రేవతిని తన పక్కన కూర్చోబెట్టుకుని మృదువుగా అడిగింది శ్యామల 'నీ పేరేమిటి పాపా !' కిలాకిలా నవ్వింది రేవతి. తెరలు తెరలుగా వస్తున్న నవ్వును ఆపుకోలేక మరింత బిగ్గరగా నవ్వింది. వంటింట్లో పనిచేసుకుంటున్న సుమిత్ర తృప్తిగా నిట్టూర్చింది 'శ్యామల రేవతిని బాగా నవ్విస్తున్నట్టుంది అలలు అలలుగా వస్తున్న నవ్వును ఆపుకోలేక ఇంకా ఇంకా నవ్వుతూనే వుంది రేవతి. సుమిత్ర అనుమానంగా ముఖం చిట్లించి గదిలోకి వచ్చింది.

తల్లిని చూడగానే రేవతి నవ్వుని ఆపుకోవటానికి ప్రయత్నిస్తూ అంది. 'అమ్మా! మరే...మరే...శ్యామత్త... నాపేరు .. పేరేమిటని అడుగుతోంది. చిన్నప్పుడు నన్ను.. నన్ను... ఎంత ముద్దు ముద్దుగా పిలిచేదీ రేవీ! అని' కళ్ళలో తిరిగిన నీటిని తుడుచుకుంటూ ఆయాసపడుతూ ఆగిపోయింది రేవతి.

'ముద్దుకి అడిగింది నువ్వేం చెప్తావో అని. అంత మాత్రానికే అలా నవ్వాలా? చూడు శ్యామత్త మొహం ఎలా ఎర్రబడిపోయిందో.'

చటుక్కున తలతిప్పి శ్యామల వేపు చూసి 'శ్యామత్తా!' అంటూ వెక్కివెక్కి ఏడ్చేసింది రేవతి. బాధగా కణతలు నొక్కుకుంది శ్యామల. 'ఛ, ఏమిటి? ఇంతలా దిగజారిపోతున్నాను. నా మనస్సుకి కొంచెం కాఠిన్యం కూడా ప్రసాదించు తండ్రీ!'

శ్యామల అనునయంగా రేవతి తల నిమిరింది. 'రేవీ! తప్పమ్మా ఏడవకూడదు. ఏదీ తలెత్తు. ఊఁ, నవ్వాలి మరి.'

'ఊహూఁ, నేనిక నవ్వను శ్యామత్తా!' తల అడ్డంగా వూపింది రేవతి.

వారి సంభాషణను ఆలకిస్తున్న సుమిత్ర ఫక్కున నవ్వేసింది.

'నీ మేనకోడలికి నీ పోలికలే వచ్చాయి. కానీ, ఏమవ్వోయ్ ఆడబడుచూ! మనసుని కొంచెం మందలించవమ్మా' అంటూ వెళ్ళిపోయింది సుమిత్ర.

తేలికగా నవ్వేసింది శ్యామల. 'విన్నావా? అమ్మ మాటలు. నాతో బోల్డు కబుర్లు చెప్తానన్నావ్ ఏదీ? నువ్విలా ఏడుస్తూ కూర్చుంటే నేను ఏడుస్తానంతే!'

రేవతి చప్పున శ్యామత్త వడిలోంచి దిగి 'నీకు నా బొమ్మల పుస్తకాలు చూపించనా శ్యామత్తా!' అని అంది.

'ఊఁ, తీసుకురా మరి.'

అలమారులో వున్న తన పుస్తకాలన్నీ అత్త ముందు పెట్టింది. 'ఇది నా డ్రాయింగు పుస్తకం. ఈ పువ్వు నేనే వేసాను. ఆవు బొమ్మ వెయ్యటం నాకు రాలేదు మాష్టారు వేసిపెట్టారు. స్కూలు తెరిచి నెలేగా అయ్యింది. ఈ రెండు బొమ్మలే వేసారు. వచ్చేవారం మరోబొమ్మ వేస్తారట మాష్టారు' ఉత్సాహంగా చెప్పుకుపోతోంది రేవతి.

'నువ్వేసిన బొమ్మేది?'

'ఇదిగో, ఈ పువ్వు బొమ్మ నేను వేసాను.'

'చాల బాగుంది'

'ఫో, అత్తా! వేళాకోళం చేస్తున్నావు. ఈ బొమ్మని చూసి మాష్టరు నన్ను కోప్పడ్డారు.' బుంగమూతి పెట్టిందిరేవతి.

'ఛ, లేదమ్మా! వేళాకోళం కాదు. నిజం, నా మాట నమ్ము మాష్టార్లు అలానే అంటారు. 'బాగా వేసారు' అని మిమ్మల్ని మెచ్చుకుంటే తరువాత బొమ్మల్ని మీరు నిర్లక్ష్యంగా గీసేస్తారేమోనని వాళ్ళ భయం.'

విశాలమయిన కాటుక కళ్ళను మరింత పెద్దవిగాచేసి అత్త కళ్ళల్లోకి చూసింది రేవతి.

'మాకు సైన్సూ లెక్కలూ ఒకే మాష్టారు చెప్పేవారు. ఆ మాష్టారు ఇలా అంటూండేవారు. 'మాష్టార్లు అస్తమానూ పిల్లల్ని మెచ్చుకోకూడదు. దానికీ సమయం అంటూవుంటుంది. అనుగ్రహించే మాష్టార్ల కన్నా ఆగ్రహించే మాష్టార్లే పిల్లల మనస్సులో శాశ్వతంగా నిలిచిపోతారు' అంత వరకూ గంభీరంగా మాట్లాడిన మాష్టారు మావేపు చూసేవారు 'కానీ ఈ శిష్యురాళ్ళు వున్నారే నిజంగా రాళ్ళే! మావద్ద చదువుకుంటున్నప్పుడు మాష్టారూ; మాష్టారూ అంటూ శిష్యరికం వెలిగిస్తారు. స్కూలు దాటి రోడ్డుమీద అడుగుపెట్టేరా ఇక మేమీ రాళ్ళ కంటికి కనిపించం. నమస్కారం పెట్టాలనైనా తోచదు. ప్చ్ కలికాలం'



**రు. 20 కి గడియారం పొందండి**

మాచే క్రొత్తగా కనిపెట్ట బడిన స్కీము ద్వారా రు. 147 విలువగల రోమర్ పాపులర్ వాచీని రు. 20 లకే పొందండి

నేడే మీ ఆర్డరు పంపండి



Romer Agencies, (AP 15)
Box 1441, DELHI-6.

ఏజెంట్లు కావలెను

35% కమిషన్ పొందు పద్ధతి మీ ప్రఖ్యాతి వహించిన "ఎస్కార్ట్" ఆ? వరల్డ్ పోర టబుల్ ట్రాన్సిస్టర్ స్కీము చుటకు ఏజెంట్లు కావలెను షరతులకు, శాంపిల్ ట్రాన్సిస్టర్‌కు వ్రాయండి.



JAGEE & CO (57)
Post Box 1115, Delhi 6.

# తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన నూతన ఆయుర్వేద ఔషధము "శ్విత్రమోచన్" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా ఇవ్వబడును వెంటనే వ్రాయండి

BIHAR KUSTA KUTIR
(2) P O Lalbigha (Gaya)

ప్రత్యేక చికిత్స

Licenced under M & T P. Act — Rule (83)

శీఘ్రస్తంభనము - నరాల బలహీనత పో? మంచిశక్తి కల్గుటకు సీ కి మర నకు ? లం 1 సీ? రూ 27/-. సై కం ముందుగా పంపాలి.

**డా. రత్నం సన్స్, (Estd 1904)**
అజంపురా రైల్వే వంతెనవద్ద,
New Malakpet,
**హైదరాబాద్ — 36 ఆం ప్ర.**


# తామరాకుపై నీటిబిందువు

ముసిముసిగా నవ్వుకునేవారు కొందరు 'నిజమేసుమా' అని మనసులో అనుకుంటూ. గడుసువాళ్ళు కొందరు లేచి నిలబడి 'మాష్టారూ! మేమలా ఎప్పుడూ చెయ్యమండి' అని అనేవారు. మాష్టారు నవ్వేవారు. 'నేనన్నదీ అదేకదమ్మా! మీరిలా నమస్కారం చెయ్యరనేగా నేను చెప్పేదీను' పాపం ఆ గడుసువాళ్ల మొహాలు పాలిపోయేవి. మిగతవారు ఫక్కుమని నవ్వేవారు. శత్రువులనుకూడా నవ్వించే నేర్పు ఆ మాష్టారుకి వుండేది. ఆ మాష్టారు నన్నెప్పుడూ ఏదోఒకటి అనేవారు సరదాకి నేను మూతి ముడుచుకు కూర్చునేదాన్ని. 'సత్యభామలా అలుగుతుంది శ్యామల కానీ, ఆకోపం ఇట్టే మరిచిపోతుంది కూడాను' అని అంటూ నన్ను నవ్వించేసేవారు మాష్టారు 'శ్యామల అక్షరాలు గుండ్రంగా వుంటాయి వాటిని దూరాన్నించి చూస్తే వరుసగా జీరోల్లా కనిపిస్తాయి అదేమిటో పెన్నుని గంటలా పట్టుకుంటుంది.' అని అనేవారు

'పూర్వజన్మంలో నేను ఒక మహాకవికి శిష్యరికంచేసే దాన్నండి. ఆకవి కావ్యాలు చెప్తూవుంటే నేను గంటంతో వ్రాసేదాన్ని. ఆ అలవాటు ఇప్పటికీ మార్చుకోలేక పోతున్నానండి'

'అయితే నువ్వీ జన్మలో కవయిత్రివి అయిపోతావన్నమాట' మాష్టారు నవ్వు నాపుకుంటూ అడిగేవారు.

'మీ నోటిమాట నిజమయితే మీరన్న మాటలన్నీ నా మొట్టమొదటి కథలో వుదహరించేస్తానండి'

'ఊ' గడుసుదానివి అయిపోతున్నావ్. ఆ ఎంతవరకు చెప్పాను నోట్సు వ్రాసుకోండి సూర్యరశ్మిలో ఆప్రాతను..'

ఇలా ఆ మాష్టారు మమ్మల్నందర్నీ మధ్య మధ్య నవ్విస్తూ నవ్వుతూ చెప్పేవారు పాఠాలు.'

రేవతి వింతగా అత్త కళ్ళల్లోకి చూసింది. 'శ్యామత్తా! ఈ కాయితం మీద వ్రాసి చూపించు. నీ రైటింగ్ ఎలావుందో...'

'భగవాన్! నన్ను రక్షించు తండ్రీ!' మనసులో దేవుడ్ని ప్రార్థించింది శ్యామల. 'ఇప్పుడు నేను వ్రాయలేనమ్మా. వ్రాయటానికి కూడా కొన్ని నియమాలున్నాయి నాకు.'

'ఏం నియమాలు అత్తా!' రేవతి కుతూహలంగా ఆమె కళ్ళల్లోకి చూసింది.

'చెప్పినా నీకే మర్మమవుతుంది' శ్యామల హృదయం బరువెక్కింది. మరిచిపోవాలన్నా సాధ్యం కావటంలేదు! ఆ దుష్టఘడియ ప్రభావం ఈ జీవితంలో మరిచిపోవడం ఎలా సాధ్యం ఆమె కళ్ళు విశాలం చేసుకుని చూసింది. నల్లటి తెరలు ఆకళ్ళముందు తారాట్లాడాయి

కొన్ని నిమిషాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి. శ్యామల మౌనగంభీర ముద్రతో తలవంచుకు కూర్చుంది. రేవతి దిక్కులు చూస్తోంది ఏదో జ్ఞాపకంవచ్చి అత్త వడిలో తలపెట్టుకుని ఆమె కళ్ళలోకి పరీక్షగా చూసింది. రేవతి·

'శ్యామత్తా! నువ్వు కథలు చదువుతావా?'

'ఊ, అవంటే నాకు ప్రాణం'

'అయితే కథలపుస్తకం తీసుకురానా?'

'ఇప్పుడు వద్దమ్మా నేను అడిగినప్పుడు తీసుకురా?'

బుంగమూతి పెట్టింది రేవతి 'పోనీ ఓకథ చెప్పవూ'

'పిచ్చిరేవీ!' వాత్సల్యంగా రేవతి తల నిమిరింది శ్యామల. 'తిరుపతి వేంకటేశ్వరుడిని చూసేవా తల్లీ!' తెలివిగా మాట మార్చేసింది.

రేవతి కళ్ళు రెపరెప లాడించింది. 'మనింటినిండా తిరుపతి వెంకటేశ్వరస్వామి ఫోటోలే. అదిగో, గోడమీదవుంది, చూడలేదూ'

శ్యామల మనోనేత్రం ముందు అభయహస్తంతో చిరునవ్వు చిందిస్తూ స్వామి ప్రత్యక్షమయ్యాడు తన్మయత్వంతో నేత్రాలు మూసుకుంది.

అమాయకులకు ప్రతినిధి రేవతి!

'అది కాదమ్మా రేవతీ! తిరుపతిలోవుండే వేంకటేశ్వరస్వామిని చూసేవా? అని అడుగుతున్నా.'

'ఓహో తిరుపతి వేంకటేశ్వర స్వామా? నేను చూడలేనేదు. నువ్వు చూసేవా శామత్తా,'

'లేదమ్మా, నేనూ చూడలేదు.'

'అన్నట్టు మాకు దసరా సెలవులు ఇస్తే

రుగా అప్పుడు వెళదాం ఏం?'

'ఊ' వెళదాం నీ ఇష్టదైవం వేంకటేశ్వరస్వామా?'

'అదేమిటి? అలా అంటున్నావు దేవుడు ఒక్కడే కదూ?' 'నీ కింతమాత్రం తెలీదూ?' అన్నట్టు అడిగింది రేవతి.

'ఎవరు చెప్పారమ్మా నీకు?' నవ్వుతూ ప్రశ్నించింది శ్యామల

'ఎవరేమిటి? చాలామంది చెప్పారు. 'దేవుడు ఒక్కడే' అని.'

'నాన్నగారు, అమ్మ, మాష్టార్లూ ఇంకా బోల్డుమంది చెప్పారు. మన దేవుడిగది చూపిస్తానురా, అత్తా!' మళ్లీ ఏమనుకుందో రేవతి. అత్త మొహంలోకి ఒకసారి పరీక్షగా చూసి 'ఇప్పుడు వద్దులే, అమ్మ




లింటాస్-HBS. 34A-140 TE.

**1967-68 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరనైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు



ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, సర్వీసులో ప్రమోషన్ లేక ట్రాన్సుఫర్లు, పిల్ల జననం, వివాహం సుఖ సంతోషాల మరియు చెడు నక్షత్రముల శాంతి చేయుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజి అదనం ఒకసారి చూచి సంతృప్తి చెందగలరు.

PT DEV DUTT SHASTRI
Raj Jyotshi, (WAP) P B 86,
JULLUNDUR CITY.



## ఏజెంట్లు కావలెను

మా ప్రఖ్యాత "స్టెర్లింగ్" ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్‌సిస్టర్ 35% కమిషన్ పద్ధతిపై విక్రయించుటకు ఏజెంట్లు కావలెను. షరతులకు & శాంపిల్ ట్రాన్‌సిస్టర్‌నకు వ్రాయండి.

Sterling Television Co.,
Post Box 1009 (WAPM) Delhi 6.







## తామరాకుపై నీటిబిందువు

దేవుడివద్ద దీపంవెలిగించాక చూద్దాం. ఏం?'

'సరేనమ్మా.'

'రేవతీ! ఇలారా.' వంటింట్లో నుండి సుమిత్ర పిలిచింది.

చిన్నిమనసుల్లో ఏ ఊహైనా స్థిరపడటానికి కారణం ఇతరులు చెప్పేమాటలే. ఆడేపాడే వయసులో తల్లిదండ్రులు, గురువులు వీరికి దైవసమానులుగా కనిపిస్తారు. వారు అనే ప్రతీమాట సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది.

'దేవుడు ఒక్కడే అట. మరి ఇన్నిరకాల పటాలున్నా యేమిటి?'

'రేడియో ఇంత చిన్నదిగా వుందికదా? మరి పెద్ద పెద్ద మనుష్యులు అందులో వుండి ఎలా మాట్లాడుతారు? అది ఒక ప్రత్యేక రాజ్యమేమో? అందులో అందరూ చిటికనవేలంత మనుష్యులు వుంటారేమో!' ఇలాంటి ఆశ్చర్య కరమయిన ఆలోచనలు ఎన్నో వస్తూంటాయి.

వారి సందేహాలను తెలుసుకుని ఓపికగా సమాధానం ఇచ్చేవారూ తక్కువే!

అంతటి ఓర్పు ఈ కాలపువారికి వుండదు!

శ్యామల మనస్సు గతంలోకి జారిపోయింది.

స్వామి వివేకానంద మృదు మధుర గంభీరవాక్కులు ఆమె మనసులో మారుమ్రోగాయి.

వివిధ ప్రదేశములలో జనించి, భిన్న మార్గముల—భిన్నరీతుల ప్రవహించినను నదులన్నియు సాగరమున లీనమగునట్లు, సర్వేశ్వరా! భిన్నజాతుల విభిన్నారాధన మార్గములన్నియు నిన్నే చేరుచున్నవి.

ఎవ్వడే రూపమున నన్ను జేర ప్రయత్నించినను నేను వానిని జేరెదను. మానవులందరు నన్ను జేరుట కనియే వివిధ మార్గములలో ప్రయాస పడుచున్నారు. ఆ మార్గములన్నియు నన్నే చేరుచున్నవి.

ప్రపంచమునందలి మానవులెల్లరు నొక కుటుంబముగా గూర్చేది విశ్వమతము దేశకాలాతీతమైనది కావలెను. అది బోధించు భగవంతుని వలెనే యదియు ననంతమై వుండవలెను. హిందువులు, క్రైస్తవులు, పుణ్యపురుషులు, పాపులు అను భేదములేక ఎల్లరపై సమానముగా ప్రకాశించు సూర్యుని వంటిది విశ్వమతము. వివిధ మతములన్నియు దానిలో ఇమడగలవు. ప్రపంచమునందలి ప్రతివ్యక్తిని, ప్రతిప్రాణిని తన హృదయమున ఇముడ్చు కొనునంతటి విస్తృతి కలదియై, ఇంకను విస్తృతి కలదియై వుండవలెను.

స్త్రీ పురుష భేదమునకు అతీతమై ప్రతి వ్యక్తియందును నిహితమైయున్న భగవదంశమును గుర్తించుచు దానిని తద్వ్యక్తి గుర్తించి తరించునట్లు సహకరింపగలుగునదియే విశ్వమతము.

అట్టి మతమును మనము చూపగలిగితిమేని మతాభిమానములకు, మతాంతర స్వీకరణములకు అవసరమే వుండదు.

ఈ విశ్వమతమును ప్రపంచమంతయు అనుసరించును.

కాని క్షుదార్తులైయున్నవారికి మతము వలన ఏమి ప్రయోజనము.

సోదరమానవుల దురవస్థను మార్చుట కుపకరింపనిచో అన్ని మతములును నిష్ప్రయోజనములే.

స్వప్నావశిష్టురాలిలా కూర్చుండిపోయింది శ్యామల.

'శ్యామలత్తా! చీకటి పడిపోయింది. లైటైనా వేసుకోకుండా కూర్చుండిపోయావేం?' రేవతి శ్యామలను కుదుపుతూ అంది.

శ్యామల త్రుళ్లిపడింది.

'ఓహో, చీకటి పడిపోయింది నేను గమనించనేలేదు' తత్తరపాటుతో లేచినుంచుంది.

'హాల్లోకి వెళ్లిపోదాం రా అమ్మా రేవతీ!'

హాల్లో సోఫాలో కూర్చున్నారు రేవతి, శ్యామల.

టేబుల్‌పై వున్న ఫ్లవరువాజుని చూస్తూ 'శ్యామలత్తా! రేపు మనం తోటలోని రంగుల రంగుల పువ్వులుతెచ్చి ఫ్లవరువాజులో పెడదామా?'

'ఊఁ'

'రోజూ నాకు రెండు జడలు వేస్తావా?'

'ఊఁ'

'నన్ను రోజూ పార్కుకి తీసికెళతావా?'

'ఊఁ'

'మాష్టారు ఇచ్చిన హోంవర్కు నేను

వెయ్యలేకపోతే నువ్వు చేసి పెడతావా?'

'ఊఁ'

'మనం వారానికి ఒకసారి సినిమాకి వెళదామా?'

'ఊఁ'

'శ్యామలా! ఒకపాట పాడవూ?''

'ఊఁ'

'పాడమని'

'ఊఁ'

'అత్తోయ్! విన్నే!' రేవతి శ్యామల చెవిలో అరిచింది.

శ్యామల ఉలిక్కిపడింది 'అబ్బబ్బ అళ్లిపోయాను రేవతీ!'

రేవతి కిలాకిలా నవ్వింది. 'పోనీయ్, పాడకపోతే పోనీలే. విన్నాకటి అడుగుతాను.



చెపుతావా?'

'తెలిసినట్లయితే చెప్పకుండా దాచేసుకుంటానేమిటమ్మా?'

'నువ్వు కళ్ళు తిప్పకుండా ఎలా చూస్తున్నావు'

శ్యామల ముఖాన్ని అరిచేతుల్లో దాచుకుంది. అస్పష్టంగా ఏదో అందామె. కానీ రేవతికి సరిగా వినిపించలేదు.

'అదేమిటి? శ్యామత్త కళ్ళు తిప్పకుండా ఎలా చూస్తుంది' అప్పుడే హాల్లోకి అడుగు పెట్టిన తండ్రినీ, తల్లినీ కుతూహలంగా అడిగింది రేవతి.

క్షణంసేపు ముఖాలు చూసుకున్నారు సుమిత్ర, రాఘవరావు.

అతడు కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకోసాగాడు వణుకుతున్న చేతులతో

సుమిత్ర రేవతి తలను అక్కున చేర్చుకుంది

'తప్పమ్మా అలా అడగకూడదు. అవి... అవి మామూలు...'

శ్యామల తల అడ్డంగా వూపింది.

'నా గుండె బండ అయిపోయింది. రేవతికి చెపితే మరే నష్టమూ రాదు చెప్పేసేయి వదినా!'

భారంగా నిట్టూర్చి భర్త వేపు చూసింది సుమిత్ర. అతడు రేవతిని వడిలో కూర్చో బెట్టుకున్నాడు

'అమ్మా! రేవతీ! నీనుండి ఈ నిజం దాచడం అవివేకమే అవుతుంది. కానీ జరిగిన ఘోరం విని నీచిన్ని మనసు తట్టుకోలేదు తల్లీ!'

రేవతి వెక్కివెక్కి ఏడ్చేసింది.

'అదేమిటో చెప్పేయి నాన్నా! శ్యామత్త... శ్యామత్త.. ఇంత మంచి శ్యామత్తకు ఏం జరిగింది? చెప్పవూ?'

## తామరాకుపై నీటిబిందువు

దీర్ఘంగా నిట్టూర్చాడు రాఘవరావు.

సుళ్ళు తిరుగుతున్న హృదయాన్ని అదిమి పట్టింది సుమిత్ర.

శ్యామల పాలిపోయిన మొహాన్ని కిందకు వంచుకుంది.

'శ్యామత్తా.' బోరున ఏడ్చేసింది రేవతి.

'మీ రందరూ నన్నిలా ఏడిపిస్తున్నా రెందుకు?'

'రేవీ!' రేవతిని హృదయానికి హత్తుకుంది శ్యామల.

'ఆరుసంవత్సరాల క్రితం దీపావళినాడు జరిగిన దుర్ఘటన. నా జీవితగతినే మార్చి వేసిందమ్మా!

వెలుగు రేఖలను పంచియివ్వవలసిన దీపావళి— చిమ్మచీకటిని ప్రసాదించింది తల్లీ!

విధికి ఎదురీదడం సాహసమే అవుతుంది, అందుకనే విధి బలీయం అన్నారు.

తామరాకుపై నీటిబొట్టు వున్నంతసేపే అది జారి నీటిలో కలిసిపోతే...'

'అత్తా, అత్తా! ఏమిటేమిటో అంటున్నావు. నాకు అర్థం కావటంలేదు అసలేం జరిగిందో చెప్పవూ?...' రేవతి చెంపల మీదుగా ఆగకుండా కన్నీరు ప్రవహించ సాగింది.

'చెప్పేస్తానమ్మా చెప్పేస్తాను.

ఆరుసంవత్సరాల క్రితం దీపావళినాడు అంతా సరదాగా బాణసంచా కాలుస్తున్నాము అప్పుడు రఘు అన్నయ్యకూడా వున్నారు నువ్వు చిన్నదానివి. నాలుగేళ్ళు కూడా వుంటాయో లేదో. రఘూ అన్నయ్య విష్ణు చక్రం కాలుస్తుంటే నువ్వూ కాలుస్తానని పేచీ పెట్టావు. అదేమిటో చిన్నప్పటి నుండి భయమంటే ఏమిటో కూడా ఎరగవు.

ఎంత చెప్పినా వినలేదు నువ్వు. రఘూ అన్నయ్య నీ చేతికి విష్ణుచక్రం ఇచ్చారు. అది గిరా గిరా తిరుగుతుంటే సంతోషంతో చప్పట్లు కొడుతూ కిందకు విసిరేసావు. అది గిరాగిరా తిరుగుతూ నీ కాళ్ళవద్దకు వచ్చేస్తుంటే, నేను చప్పున కిందకువంగి...

'శ్యామా!' రాఘవరావు వెర్రిగా అరిచాడు.

'ప్లీజ్, శ్యామలా! జరిగిపోయింది గుర్తుకు తెచ్చి మా మనసులు బాధ పెట్టకు.' సుమిత్ర బాష్పకణాలను ఒత్తుకుంటూ అంది

కన్నీటి తెరలగుండా అత్త ముఖంలోకి చూసింది రేవతి.

'అమ్మా, నువ్వుండు. ఊఁ, అప్పుడేమయిందత్తా.'

'...నిన్ను ఎత్తుకోబోతూంటే రఘూ అన్నయ్య విసురుగా నిన్ను వెనక్కులాగేసాడు.

ఆ విష్ణు చక్రం నా కళ్ళనిండా నిప్పురవ్వలను నింపి పక్కుమంటూ నవ్వింది.

నేను కెవ్వున కేకవేసి పడిపోయాను. అదృష్టవశాత్తూ నీకేమీ అవ్వలేదు. నేనా షాక్‌నుండి కొన్ని వారాలవరకూ తేరుకోలేకపోయాను

రఘు అన్నయ్య నన్ను విశాఖపట్నం తీసుకువెళ్ళారు. ఎందరెందరో డాక్టర్లు నా కళ్ళని పరీక్షించి పెదవి విరిచేశారు. కనుపాప లేనిదే కంటిదృష్టెలా వస్తుంది?

రఘు అన్నయ్యకూడ కళ్ళడాక్టరే కానీ పెరట్లోని చెట్టు మందుకు పనికిరాదని అన్నయ్య నా కళ్ళల్లోకి చూడటానికే భయపడేవాడు. ఇక విధిలేక కొడిగట్టుతున్న ఆశతో ఆఖరుసారిగా అన్నయ్య నా కళ్లను పరీక్షించాడు. లాభంలేకపోయింది.

అయినా నాకిక కళ్ళెందుకమ్మా రేవతీ! రామలక్ష్మణులవంటి అన్నయ్యలు, సీతమ్మవంటి వదిన, కుశలవుల గుణాలను పుణికిపుచ్చుకున్న నువ్వు వుండగా ఇక నాకు కళ్ళు దేనికి?' వాత్సల్యంగా రేవతి తల నిమిరింది.

'మరి అవి....అవి...' జలజలరాలే కన్నీటిని తుడుచుకుంటూ అడగలేక అడిగింది రేవతి.

'ఇవి గాజు కళ్ళమ్మా'

రేవతి కెవ్వున అరిచింది.

భూనభోంతరాలు దద్దరిల్లలేదు.

సూర్యచంద్రాదులు గతులు తప్పలేదు.

కానీ రేవతి మనసులో లేచే పెను తుఫానులను ఆపటం ఎవరికి సాధ్యం. ఆమె వూహలు సెలమట్లయ్యాయి. ●

